ఒట్టావా (కెనడా) ఆంధ్రవాహిని ఆంధ్రజ్యోతి నిర్వహించిన 1988 విభవ శ్రీరామనవమి కథానికల పోటీలో
రెండవ బహుమతి రు. 300 గెలుచుకున్న రచన




స్కూలు పిల్లలకు సాంక్షన్ చేసిన స్కాలర్ షిప్ డబ్బు పట్టుకొని టీచరు నారాయణ పరారీ అయ్యాడు.

అతను ఆ డబ్బు తీసుకువెళ్ళి నెల రోజులయింది. పిల్లలకు డబ్బు చెల్లించినట్టు ఎక్విటన్సు రోల్సుకానీ, డబ్బుకానీ, అతను ఇంతవరకు ఆఫీసుకు అప్పగించలేదు.

"నారాయణ పిల్లలకు స్కాలర్‌షిప్ డబ్బు అసలు చెల్లించనే లేదని దర్యాప్తులో తేలింది. కనుక ఆ టీచర్ని వెంటనే సస్పెన్షన్‌లోపెట్టి అతని మీద తగిన చర్య తీసుకోండి."

ఇదీ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు పంపిన రిపోర్టు.

'చిన్న పిల్లలకు నీతులుచెప్పి వాళ్లని ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దవలసిన టీచరు ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం క్షమించరాని నేరం. అందులోనూ ఆ డబ్బు గిరిజనుల పిల్లల కోసం ఇచ్చినది. ఇప్పటికే గిరిజనుల్ని కంట్రాక్టర్లు, వర్తకులు, వడ్డీ వ్యాపారులు దోచుకుంటున్నారని అలజడి జరుగుతోంది. దోపిడీవర్గాల జాబితాలో బడిపంతులు కూడా చేరడం సహించరాని విషయం. ఇంతకూ ఎవరా దుర్మార్గుడు?' అనుకున్నాడు ప్రసాదరావు.

ఆ రోజు అతని టేబులు మీదకి వచ్చిన టపా కట్టలో మొదటి కాగితం అది. ఆ కాగితాన్ని జాగర్తగా పేపరు వెయిట్ కిందపెట్టి మిగిలిన టపా చూస్తూ వుండగా మరొక పిటిషన్ అతని దృష్టిని ఆకర్షించింది. శాంతకుమారి అనే పంతులమ్మ పెట్టుకున్న ఆ అర్జీలో వున్న విషయం ఇది.

అయ్యా!

నన్ను నా తోటి టీచరు భాస్కరరావు రకరకాలుగా వేధిస్తున్నాడు - స్కూలుకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు

# అడవి గోల

## — అంగర సూర్యారావు

అతను మా ఇంటి ముందు ఆగి — తన పక్కని వున్న పిల్లల మీద వంకపెట్టి తిడుతున్నాడు. ఊరుకోలేక అడిగితే కొట్టడానికి నా మీదకు వచ్చాడు. నా కులం పేరు ఎత్తి మరీ తిడుతున్నాడు. మా హెడ్మాష్టారు అతనిని ఏమీ అనడంలేదు. పైగా అతనినే వెనకేసుకు వస్తున్నాడు. అతని ధోరణి చూస్తూ వుంటే— అతను ఎప్పుడు ఏ క్షణంలో — నా మీద దౌర్జన్యం చేస్తాడో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాను. నన్ను అతని బారి నుంచి కాపాడమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు,

విధేయురాలు,

శాంతకుమారి

ఆ అర్జీ నకళ్లు జిల్లా కలెక్టర్, సవ్యసాచిగారి పేర్న అడ్రస్సుకు, జిల్లా కేంద్రంలో వున్న సదరు కులం ప్రెసిడెంట్‌గారికి కూడా పంపినట్టు దిగువన రాసి వుంది.

ఆ రోజు వచ్చిన టపాలో ఆ రెండు కాగితాలూ అతి ముఖ్యమైనవి. మిగిలినవన్నీ సెలవుల కోసం, బదిలీల కోసం, సెలవును నగదుగా మార్చుకోవడం కోసం వచ్చిన దరఖాస్తులు. కొన్నిటికి సర్వీసు రిజిష్టర్లు కూడా జత చెయ్యడంవల్ల టపా దొంతర మరీ పెద్దదిగా కనిపిస్తోంది. మొత్తం టపా అంతా ఒక పక్కకు పెట్టి ముఖ్యమైన రెండు కాగితాలూ పైకి తీశాడు.

ఆ రెండు కాగితాలలోనూ దేనికి ప్రాధాన్యత ఇవ్వడం? 'మొదటి రిపోర్టులో డబ్బు పట్టుకుని టీచరు పరారీ అయ్యాడని వుంది. అంటే అక్కడ నేరం జరిగి పోయింది. ఎంక్వయిరీ జరిపి పోయిన డబ్బు రాబట్టుకొని టీచరు మీద చర్య తీసుకోవలసి వుంది. దానికి చాలా తతంగం వుంది. అది నిదానంగా జరగవలసిన వ్యవహారం.

'రెండో రిపోర్టు మీద ఎంత త్వరగా చర్య తీసుకుంటే అంత మంచిది. ఒక పెద్ద నేరం జరగకుండా నిరోధించినట్టు అవుతుందని, అనుకున్నాడు. ఆ రిపోర్టు జాగ్రత్తగా మరోసారి పరిశీలించి చూశాడు.

ఎవరీ శాంతకుమారి? ఎవరీ భాస్కరరావు? ఏమిటి ఏళ్ళ చరిత్ర? లేచి బీరువా లోంచి ఒక రిజిస్టరు పైకి తీశాడు.

ఆ యిద్దరు టీచర్లు ఏజెన్సీ ప్రాంతంలో వున్న ఒక ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్నారు. శాంత కుమారి రెండేళ్ళ క్రితం సర్వీసులో చేరింది. భాస్కరరావు చేరి ఒక ఏడాది మాత్రమే అయ్యింది. ఇద్దరూ వయసులో చిన్నవాళ్ళే! అంతకు మించి వివరాలు ఆ రిజిస్టర్లో లేవు.

ఒక ఆడపిల్ల సాహసంతో అడవిలోకి వెళ్ళి ఉద్యోగం చేస్తున్నప్పుడు — ఆమెకు భద్రత కలిగించి, ప్రోత్సహించవలసిన బాధ్యత డిపార్టుమెంటు మీద వుంది. అయితే ఇప్పుడేం చెయ్యాలి? — ఆ ప్రాంతంలో వున్న స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ని వెళ్ళి దర్యాప్తు చెయ్యమందామా అంటే అతను సరైన వాడు కాదు. అతను ఇప్పటికే కొన్ని అవినీతి కేసులలో ఇరుకున్నాడు. అతన్ని పంపితే న్యాయాన్ని తారుమారు చేసే అవకాశం వుంది. అంత కంటే పై అధికారి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ని పంపుదామా అంటే — అతనికి అసలు అనుభవం లేదు. కొత్తగా సర్వీసులో చేరాడు.

ఏం చెయ్యడానికీ అతనికి తోచలేదు. కొన్ని క్షణాలు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. అవినీతి పరుడి కంటే అనుభవంలేని వాడే నయం అనుకున్నాడు.

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ని ఎంక్వయిరీకి పంపమని — శాంతకుమారి రిపోర్టు మీద నోట్‌రాసి ఆఫీసరుగారి దగ్గరకు పట్టుకువెళ్లాడు. ఆయన స్థిమితంగా చదివి రెండు ప్రశ్నలువేసి — నోట్ అప్రూవ్ చేసే సరికి అరగంట పట్టింది.

ప్రసాదరావు ఫైలు పట్టుకుని తిరిగి వచ్చేసరికి అతని సీటు దగ్గర ఇద్దరు టీచర్లు నిలబడి వున్నారు. వాళ్లిద్దరూ ఏజన్సీ ప్రాంతంలో ఒక స్కూల్లో పని చేస్తున్నారట. సెలవును నగదుగా మార్చుకోడానికి దరఖాస్తులు పట్టుకు వచ్చారు. టేబుల్ సొరుగు లోంచి ఒక తెల్లకాగితం ముక్క తీసి దాని మీద వాళ్ళ పేర్లు, స్కూలు పేరు రాసి ఇచ్చి వెళ్లమని చెప్పాడు. వాళ్లిద్దరూ బుద్ధిగా అలాగే రాసి కాగితం అతని చేతికి ఇచ్చారు. ఆ స్కూలు పేరు చూడగానే ప్రసాదరావుకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

అతను రిజిష్టరు తెరచి ఒక స్కూలు పేరు చూపించి "మీకు ఈ ఆశ్రమ పాఠశాల తెలుసునా?" అని అడిగాడు.

"తెలుసు! మాకు నాలుగు మైళ్ల దూరంలో వుందండి."

"అక్కడ టీచర్ల మధ్య పేచీలేమైనా వున్నాయా?"

"వున్నాయి. హెడ్మాస్టరుకు, ఫస్టు అసిస్టెంట్‌కు పడదు. మిగిలిన టీచర్లలో కొందరు అటూ కొందరు యిటూ వున్నారు."

"వాళ్ళ మధ్య పేచీ ఎందుకు వచ్చింది?"

"అది బియ్యం బస్తాల తగవు సార్!"

"బియ్యం వ్యవహారం మనకు అక్కర్లేదు. అది ట్రయిబల్ వెల్‌ఫేర్ డిపార్టుమెంట్ వాళ్ళూ, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరూ చూసుకుంటారు. ఇప్పుడు టీచర్ల గురించి సమాచారం కావాలి. శాంతకుమారి అనే టీచరుగురించి మీకేమైనా తెలుసా?"

"మాకు అంతగా తెలియదు. కానీ ఆవిడ అన్నగారూ, భర్త మా సమితిలోనే పని చేస్తున్నారు. వాళ్ళు మాకు బాగా తెలుసు."

"ఏమిటి? ఆవిడ భర్తకూడా టీచరుగానే పని చేస్తున్నాడా?"

అవునన్నారు వాళ్ళు. ఆవిడ భర్తపేరు, అతను పని చేస్తున్న స్కూలు పేరు రాసుకుని ఆ టీచర్లిద్దరినీ పంపేశాడు.

వారం రోజుల తర్వాత జిల్లా కలెక్టర్‌గారి నుంచి ఉత్తరం వచ్చింది. శాంతకుమారి పిటిషన్ మీద ఏం చర్య తీసుకున్నారో వివరించమని — ఎంక్వయిరీ రిపోర్టు పంపమని అందులో రాశారు.

కులం పేరు ఎత్తి తిట్టినందుకు తీవ్రమైన ఆక్షేపణ తెలియజేస్తూ — తిట్టిన టీచరుమీద కఠిన చర్య తీసుకోమని డిమాండు చేస్తూ కులం ప్రెసిడెంటుగారి దగ్గర నుంచి కూడా ఉత్తరం వచ్చింది.


దానితో ఆ కేసుకు మరింత ప్రాధాన్యత వచ్చింది.

ఇచ్చిన వ్యవధి కంటే మరో వారం రోజులు ఎక్కువ గడువు తీసుకుని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎంక్వయిరీ రిపోర్టు పంపాడు.

అది అప్పర్ ప్రైమరీ స్కూలు. దానికి హాస్టల్ కూడా వున్నందువల్ల అది ఆశ్రమ పాఠశాల అయింది. ఏడో క్లాసు వరకూ వుంది. స్కూలేమో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌ది. పాఠాలు చెప్పడం, పరీక్షలు జరపడం, టీచర్లను నియమించడం, బదిలీ చెయ్యడం వగైరా బాధ్యతలన్నీ విద్యాశాఖవి!

ఆ స్కూల్లో చదువుకునే పిల్లలందరికీ భోజన వసతి సదుపాయాలు కలిగించే బాధ్యత ట్రైబల్ వెల్‌ఫేర్ డిపార్టుమెంట్‌ది. హాస్టల్ ఖర్చులతోపాటు పిల్లలకు బట్టలు, పుస్తకాలు కూడా ఆ డిపార్టుమెంట్ ఉచితంగా సప్లయి చేస్తుంది.

అక్కడి టీచర్లకు జీతాలు, పిల్లలకు స్కాలర్‌షిప్పులు



వెళ్లించడంతోపాటు — స్కూలు, హాస్టల్ సక్రమంగా నిర్వహించే బాధ్యత ఆ పంచాయతీ సమితిది. అంటే బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరుది.

ఆ స్కూల్లో రెండు వందల నలభై మంది పిల్లలు చదువుకుంటున్నట్టు రికార్డుల్లో వుంది. కానీ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ విజిట్ చేసిన రోజున నూట యిరవై మంది పిల్లలు మాత్రమే కనిపించారు. నాలుగు రోజుల తర్వాత రెండోసారి విజిట్ చేసినప్పుడు కూడా పిల్లల సంఖ్య పెరగలేదు. టీచర్లు మాత్రం పదకొండు మంది వున్నారు. ఆ టీచర్ల మధ్య పేచీకి సంతృప్తికరమైన కారణాలు ఎవరూ చెప్పడంలేదు.

ఆ ఎంక్వయిరీ రిపోర్టులో వున్న సంగతులు ఇవే!

ఆ రిపోర్టుమీద వెంటనే చర్య ప్రారంభ మయ్యింది. అప్పటికి సరిగా నెల రోజుల క్రితం ఆ స్కూలుకు ఇన్‌స్పెక్షన్‌కోసం వెళ్లిన స్కూళ్ల ఇన్‌స్పెక్టర్ — రెండు వందల నలభై మంది పిల్లలు వున్నట్టు తప్పు రిపోర్టు ఇచ్చినందుకు — అతనిని సంజాయిషీ అడిగారు.

నిజంగా చదువుతున్న పిల్లల సంఖ్యను బట్టిచూస్తే ఆ స్కూలుకు ఏదు క్లాసులకు ఏడుగురు టీచర్లు సరిపోతారు. అదనంగా వున్న నలుగురు టీచర్లను అవసరం వున్న ఇతర స్కూళ్లకు బదిలీ చేసేశారు. ఆ బదిలీలలో ఎక్కడో మారుమూల స్కూల్లో పనిచేస్తున్న శాంతకుమారి భర్త రాజయ్యను, శాంత కుమారినీ ఒకే స్కూల్లో వెయ్యడం జరిగింది. శాంత కుమారిని తిట్టిన భాస్కరరావును కూడా బదిలీ చేశారు.

ఇలాగ ఒక వరసనుంచి చర్య తీసుకుంటూ వుండగా జిల్లా కలెక్టరుగారి నుంచి తీవ్రమైన పదజాలంతో మరో ఉత్తరం వచ్చింది. ఇక్కడ జిల్లా కలెక్టరు సవ్యసాచిగారి గురించి ఒక మాట చెప్పాలి. ఆయన నిప్పులాంటి మనిషి! ఆయన పేరుకు ఎవరైనా దరఖాస్తు పెట్టుకుంటే దానిమీద చర్య తీసుకునే వరకూ ఆయన వూరుకోడు. అలాంటివన్నీ ఆయన స్వయంగా ఒక పుస్తకంలో రాసుకుంటాడు. అవినీతి పరులైన ఉద్యోగులమీద ఆయన కఠిన చర్య తీసుకోవడమే కాక వాళ్లను నలుగురి ముందూ నిలబెట్టి తిట్టే అలవాటు కూడా వుంది. అందుకే ఆరు నెలలు లేదా సంవత్సరానికి మించి ఆయన ఏ జిల్లాలోనూ పనిచెయ్యలేదు. పైరవీలకు అలవాటుపడ్డ రాజకీయ నాయకులు తమ జిల్లా నుంచి ఆయన్ని బదిలీ చేయించేవారు. లేకపోతే ఆయన నిజాయితీకి మెచ్చి ఇంత కచ్చితమైన అధికారి రాజధానిలో వుండడం అవసరం అని — ఏ ముఖ్యమంత్రిగారో ఆయన్ని బదిలీమీద తీసుకువెళుతూ వుండేవారు. ఎడాపెడా ఆయనకు బదిలీలు తప్పేవికావు. అయినా ఆయన తన పద్ధతి మార్చుకోలేదు. ఇప్పుడు శాంతకుమారి పిటీషన్ వెళ్లి ఆయన చేతుల్లో పడింది.

"త్వరగా రిపోర్టు రాసి పట్టుకురా! సంతకం పెడతాను. ఆ కలెక్టర్ అసలే మంచివాడు కాదు. ఆలస్యం అయితే నామీద గవర్నమెంటుకు రిపోర్టు చేసినా చేస్తాడు" —ఆఫీసరుగారు స్వయంగా ప్రసాదరావును పిలిచి చెప్పారు.

## ప్రపంచ కుతంత్రం

చాకలికి
చాకిరీ
తెలుసు
గాడిదకి
మొయ్యడం
తెలుసు
దొర్లకి
దోపిడీ
కూసువిద్య
కుక్కకి
కాపలా
విధే
అయితేం
ఎంగిలి
కతికి
దొర్లంగని
మొరగడం లేదు
తెలుసుకుని
ఓండ్ర పెడితే
మోదులు
గాడిదకే
పిటీ
చాకలి కూడా
పని మినహా
అధికారాలన్నీ
వరాయివనే
అనుకుంటున్నాడు.

– నందివాడ భీమారావు

అతను మిగిలిన పనులన్నీ ఒక పక్కకు పెట్టి ఆ రిపోర్టు పట్టుకు వెళ్లాడు. ఆఫీసరుగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అందులో చిన్నచిన్న మార్పులుచేసి అప్పటికప్పుడు టైపుచేయించి సంతకం పెట్టి డిస్పాచ్ చేయించి కాంపు వెళ్లిపోయాడు.

పైకి అతి సామాన్యంగా కనిపిస్తున్న ఆ రిపోర్టులో కలెక్టరుగారికి ఆయువు పట్టులాంటి పాయింటు ఒకటి దొరికింది.

• బియ్యం బస్తాల లెక్క సరిపెట్టడంకోసం ఒక డిపార్టుమెంటు వాళ్లు — హెడ్మాస్టరు సహకారంతో పిల్లల సంఖ్య ఎక్కువవేసి చూపించారు.

ఆ రకంగా పెరిగిన పిల్లలందరికీ స్కాలర్ షిప్పులూ, బట్టలు, పుస్తకాలు వగైరా మరొక డిపార్టుమెంటు శాంక్షను చేసింది.

• ఇంకొక డిపార్టుమెంటు మిల్కుపౌడరు పేకెట్లు వగైరా సప్లయిచేసింది.

పిల్లల సంఖ్య పెరిగినట్టు రికార్డులలో చూపించడంతోఎడ్యుకేషన్ డిపార్టుమెంటు వాళ్లు అదనంగా కొందరు టీచర్లను వేశారు.

పనిలేకుండా కాళీగా వున్న టీచర్లు గిల్లికజ్జాలు తేవడంతో మొత్తం వ్యవహారం అంతా వెలుగులోకి వచ్చింది.

ఇదీ సంగతి! ఈ ఒక స్కూల్లోనే ఇంత డబ్బు దుర్వినియోగం అవుతోందా? ఇంకా ఇలాంటి స్కూళ్లు కొన్ని వున్నాయా?, అని కలెక్టరుగారికి సందేహం వచ్చింది. ఆయన స్వయంగా అతి రహస్యంగా దర్యాప్తు ప్రారంభించారు.

చిన్న తీగ లాగితే ఒక డొంక కాదు మొత్తం డొంకలన్నీ కదిలిపోయి అడవి అంతా అల్లకల్లోలం అయిపోతోంది.

ఎదురుచూడని ఈ ఆపద విరుచుకు పడడంతో ఈ వ్యవహారంతో సంబంధం వున్న డిపార్టుమెంట్లు పడగలెత్తిపైకి చూశాయి.

జిల్లా విద్యాశాఖ ఆఫీసులో ఈ తీగలాగినట్టు వాళ్లు కనుక్కున్నారు. ఇలాంటి వ్యవహారాలలో వాళ్లు ఆరితేరినవాళ్లు. తప్పించుకోడం పెద్ద కష్టం కాదు. కానీ కలెక్టరు కర్కోటకుడు కనుక ఇక్కడ కొంచెం ఆలస్యం అవుతుంది. అవకాశం కోసం వేచి చూస్తున్నారు.

రహస్యంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో ఇతర డిపార్టుమెంటులకు ప్రమేయం వున్నప్పటికీ వివరాలు ఎవరికీ తెలియవు. ఈ కేసుకు సంబంధించిన రహస్యమైన ఫైళ్లన్నీ జిల్లా విద్యాశాఖ ఆఫీసుల్లోనూ, కలెక్టర్ ఆఫీసుల్లోను నడుస్తున్నాయి.

ఎంతమేరకు డబ్బు దుర్వినియోగం అయ్యిందో లెక్కలువేసి పంపమని కలెక్టరుగారి నుంచి జిల్లా విద్యాశాఖాధికారికి రహస్యంగా ఉత్తరం వచ్చింది. 'ఇదెక్కడి గొడవరా! భగవంతుడా!' అని విద్యాశాఖ తలపట్టుకు కూర్చుంది. నలుగురు టీచర్లను అదనంగా వెయ్యడం తప్ప విద్యాశాఖ ఆ స్కూలు మీద డబ్బేమీ ఖర్చు పెట్టలేదు. ఇతర డిపార్టుమెంటుల నుంచి వివరాలు సేకరించాలి.

మరో నెల రోజులు గడిచిపోయాయి. కానీ లెక్కలు తేలలేదు. ఇతర డిపార్టుమెంటులు సహకరించడంలేదు. సరైన సమాచారం ఇవ్వడంలేదు. పైగా వాళ్లు జిల్లా విద్యాశాఖాధికారి మీద వత్తిడి తెస్తున్నారు. ఆ సెక్షను చూస్తున్న ప్రసాదరావు ఈ వ్యవహారంలో మునిగి తేలుతున్న సమయంలో ఒక టీచరు వచ్చి అతని బల్లముందు నిలబడ్డాడు.

"ఎవరు మీరు? ఎందుకొచ్చారు?" అడిగాడు.

"మా 'బీడీవో' గారు నామీద రిపోర్టు చేసినట్టు తెలిసింది. మీతో నా సంగతి మనవి చేసుకోడానికి వచ్చాను. నా పేరు నారాయణ!"

"స్కాలర్ షిప్పు డబ్బు పట్టుకు పారిపోయిన టీచరు మీరేనా?"

"నేను ఎక్కడికీ పారిపోలేదు. నేరం చెయ్యలేదు. తొందరపడి మీరు నామీద ఏం చర్య తీసుకుంటారో అని భయపడి వచ్చాను."

"మీరు నేరం చెయ్యనప్పుడు భయమెందుకు?"

"ఇప్పుడు వున్న కాలమాన పరిస్థితుల్ని బట్టి నేరం చెయ్యనప్పుడే భయపడాలండి' నేరం చేసిన వాడికి వెనకదన్ను వుంటుంది. వాడిమీద ఈగనైనా వాలనివ్వరు."

'ఇదేదో కొత్త రాజనీతిలాగా వుంది. ఇందులోనూ కొంత నిజంలేకపోలేదు' అనుకున్నాడు. "అయితే వాళ్లు మీకు స్కాలర్ షిప్పు డబ్బులివ్వడం మీరు పిల్లలకు చెల్లించకపోవడం నిజంకాదా?" అడిగాడు.

"నిజమేనండి! వాళ్లు నాకు మూట యాభై రూపాయిలు ఇచ్చారు. రెండు వందల యాభైకి రశీదులు తెమ్మన్నారు. ఇదెక్కడి ఘోరకలి అని నేను దిగులుపడి కూర్చున్నాను. ఇంతలో నా కూతురికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం రావడంతో మావూరు వెళ్లాను. నా సెలవు దరకాస్తు తొక్కిపెట్టి మీకు రిపోర్టు చేశారు. నేను సెలవు నుంచి తిరిగి రాగానే ఈ సంగతి తెలిసింది. వారు నాకిచ్చిన డబ్బు వారికి తిరిగి ఇచ్చేసి రశీదు పుచ్చుకున్నాను. ఇదుగో! చూడండి!" అని ఒక కాగితం తీసి చూపించాడు.

"సరే! ఈ రశీదు ఎంక్వయిరీ ఆఫీసరుగారికి చూపించండి. ఇక మీరు వెళ్లండి."

"ఉన్న సంగతులన్నీ మీకు మనవి చేశాను. నాకేమీ అపకారం జరగకుండా చూడమని మిమ్మల్ని కోరుతున్నాను" అన్నాడు టీచరు.

"ఒక చిన్న సమాచారం చెప్పండి. మీ స్కూల్లో పిల్లలెందరున్నారు?"

"తొంభైమంది"

"రోల్సులో వున్నవాళ్లు కాదు. నిజంగా స్కూలుకు వచ్చి చదువుకుంటున్నవాళ్లెందరు?"

"నలభైమందండి!"

"మరి మీరిన్ని నీతులు చెబుతున్నారు. యాభై మందిని అదనంగా ఎందుకు చూపిస్తున్నారు?"

"నాకు ముందువున్న టీచర్లుకూడా ఏనాటి నుంచో అక్కడ తొంభైమంది పిల్లల్ని చూపిస్తున్నారండి. నేను రాగానే ఆ సంఖ్యను అమాంతంగా నలభైకి తగ్గించేస్తే నామీద చర్య తీసుకుంటారండి. నాకు ఇంక్రిమెంట్లు కోసేస్తారండి."

రికార్డులలో తప్ప స్కూల్లో కనిపించని పిల్లలకు కూడా డబ్బు చెల్లించినట్టు దొంగ రశీదులు సృష్టించ గలిగితే స్కాలర్‌షిప్పు ఎక్కువెమ్ము సరిపోయేది. కానీ — డబ్బు దగ్గర ఫోర్జరీ చెయ్యడానికి సాహసించలేక పోయాడు. కనక యీటీచర్లో ఫిఫ్టీ పెర్సెంట్ నీతి వుందనుకున్నాడు.

"అయ్యా, అన్ని సంగతులూ దాపరికం లేకుండా మీకు చెప్పాను. ఆపైన మీ దయ. సెలవిప్పించండి" వెళ్ళిపోయాడు.

దీనితో మొదటి రిపోర్టు పరిష్కారమైనట్టే లెక్క! ఒక వార్నింగు ఇచ్చి టీచర్ని విడిచిపెట్టవచ్చు.



కళాప్రపూర్ణ డాక్టర్ వెంపటి చినసత్యం శిష్యురాలు కుమారి రేణుక ఇటీవల పలమనేరులో రంగప్రవేశం చేసిన దృశ్యం

ఇక రెండో రిపోర్టు వుంది. అందులో హేమా హేమీలంతా ఇరుక్కుపోయారు. అడవులలో వున్న అన్ని సమితులకు ఈ కార్చిచ్చు వ్యాపిస్తోంది. మూడు నెలలు గడిచినా వ్యవహారం ఒక కొలిక్కిరాలేదు.

ఆ సమయంలో జిల్లా కలెక్టరు సవ్యసాచి గారికి ప్రమోషన్‌మీద రాజధానికి బదిలీ అయ్యింది. అధికారులంతా ఏ జిల్లా కలెక్టరుకూ ఇవ్వనంత ఘనంగా ఆయనకు వీడ్కోలు ఇచ్చి పంపేశారు.

ఒకనాటి ఉదయం ఆఫీసులో అడుగుపెట్టగానే ప్రసాదరావు చేతికి ఒక ఆర్డరు ఇచ్చారు. ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన రహస్యమైన ఫైళ్లన్నీ కాన్ఫిడెన్షియల్ సెక్షనుకు అప్పగించమని ఆ ఆర్డరులో వుంది.

అతను ఒక క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఆ ఫైళ్లన్నీ తీసుకువెళ్లి కాన్ఫిడెన్షియల్ సెక్షన్ చూస్తున్న ఆఫీసు సూపరింటెండెంట్‌కు ఇచ్చేశాడు. ఆ సూపరింటెండెంట్ ఆ ఫైళ్లన్నిటినీ భద్రంగా ఇనుప బీరువాలో పెట్టి తాళం వేసేశాడు. ఇక అక్కడితో ఆ వ్యవహారం ముగిసిపోయినట్టే లెక్క!

నెత్తిమీదినుంచి పెద్ద బరువు దించినట్టయింది ప్రసాదరావుకు. 'ఇప్పుడు మనసు తేలికగా వుంది' అనుకుంటూ తన సీటు దగ్గరకు వచ్చేసరికి అక్కడ ఒక టీచరు వున్నాడు.

"ఏమిటి మాస్టారు! ఏం కావాలి?" అడిగాడు.

"నాపేరు రాజయ్య" అన్నాడతను.

"ఈ పేరు ఎక్కడో విన్నట్టువుంది."

"నేను శాంతకుమారి భర్తనండి."

"ఓహో! అలాగా! ఇప్పుడు గుర్తొచ్చింది. ఏమిటిలా వచ్చారు?" అడిగాడు ప్రసాదరావు. "నేనేం తప్పు చేశానని సార్ నన్ను బదిలీ చేశారు?" అడిగాడు రాజయ్య.

"మీరు తప్పు చేశారని కాదు. మీ భార్యాభర్త లిద్దరూ — విడివిడిగా దూరంగా వుండడం మంచిది కాదని ఒకే స్కూలుకు చేశాం. ఏం కలిసి వుండడం మీకు ఇష్టం కాదా?"

"ఇష్టమా? ఆవిడ సంగతి మీకు తెలియదు. పరమ పేచీకోరు మనిషి!... ఆవిడతో వేగలేక నేను ఇంతకాలం నుంచీ దూరాన హాయిగా వుంటున్నాను. మమ్మల్ని ఒకచోట వెయ్యమని మీకు చిన్నకాగితం ముక్కయినా పెట్టుకోలేదు. అయినా మీరు వేశారు. అధికారులమాట ఎందుకు కాదనాలని వెళ్లి చేరాను. వెళ్లిన దగ్గర్నుంచీ ప్రతి చిన్న విషయానికీ తగువే! నిన్నగాక మొన్న పెద్ద గొడవయిపోయింది. ఆవిడా, వాళ్ల అన్నయ్య కలిసి నన్ను పట్టుకు కొట్టారు. నేనిక ఆవిడతో కలిసి పనిచెయ్యలేను. సెలవు పెట్టేసి వెళ్లిపోతున్నాను. ఆవిడకు దూరంగా మరో స్కూలుకు బదిలీ చెయ్యండి. నేను మాత్రం ఆ స్కూల్లో తిరిగి చేరను" అని చెప్పి ఒక దరఖాస్తు ఇచ్చి వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు శాంతకుమారి నుంచి మరో రిపోర్టు వచ్చింది. అందులో —

*"అయ్యా! నా భర్త శుద్ధ అవినీతిపరుడు! అతని మాటలు నమ్మకండి. అతని అవినీతి చర్యలలో నేను భాగం పంచుకోలేక పోతున్నాను. అవన్నీ కాగితంమీద రాయడానికి భయపడుతున్నాను. మీకు అనుమానంవుంటే ఎవరినైనా పంపి దర్యాప్తు చేయించవచ్చు.*

*—ఇట్లు విధేయురాలు*

*శాంత కుమారి*

అని రాసి వుంది.

ఆవిడ పంపిన మొదటి రిపోర్టు మీద చర్య తీసుకుంటే అడవులు అంటుకున్నాయి. ఇక ఈ రెండో రిపోర్టు మీద దర్యాప్తు జరిపితే ఏం జరుగుతుందో తెలియదు. చాలా మందిలోలేని ప్రత్యేక గుణం ఏదో — ఈ శాంతకుమారిలో వుండాలి. అది ఆమెలో లోపమైనా కావచ్చు. లేదా అవినీతిమీద విపరీతమైన ద్వేషం అయినా కావచ్చు.

'ఆవిడ అనుకుంటున్నట్టు అవినీతి అట్టడుగున కేవలం బడిపంతులులోనేకాదు అది చిన్న ఉద్యోగులను దాటి పైకి ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగిపోయింది. దానివేళ్లు దశదిశలా వ్యాపించుకుపోయాయి. అవినీతి మహావృక్షాన్ని తీగెలూ, తాళ్లూ కదిలించలేవు. దాన్ని కూకటివేళ్లతో పెకలించాలంటే ప్రళయకాల ఝంఝా మారుతమేదో రావాలి. అంతవరకూ అవినీతి గురించి ఎవరు మాట్లాడినా అది అరణ్య రోదనమే అవుతుంది, అనుకుంటూ తలవంచుకు వెళ్లిపోయాడు.